సంక్రాంతి పర్వదిన శుభాకాంక్షలు

Happy Makar Sankranti

క్లుప్తంగా

ఉద్యోగాల అమ్మకంపై విచారణ

హసన్‌పర్తి: హసన్‌పర్తి మండలం వంగపహాడ్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగాల అమ్మకంపై సోమవారం విచారణ చేపట్టారు. ఇటీవల సొసైటీకి చెందిన కొంతమంది సభ్యులు డీసీఓకు ఫిర్యాదు చేశారు. సొసైటీలో సీఈఓతో పాటు కంప్యూటర్ ఆపరేటర్, సేల్స్ మేనేజర్ పోస్టులను అమ్ముకున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. దీనిపై సొసైటీ జిల్లా సహకార శాఖ అసిస్టెంట్ రిజిస్ట్రార్, సంఘం నోడల్ ఆఫీసర్ జగన్మోహన్‌రావు విచారించారు. సభ్యుల వాంగ్మూలాన్ని నమోదు చేశారు. ఒక్కో సభ్యుడిని పిలిచి మాట్లాడారు. తమకు సమాచారం లేకుండానే ఉద్యోగాలు అమ్ముకున్నారని కొంత మంది సభ్యులు ఆరోపించగా, సభ్యుల తీర్మానం మేరకు ఉద్యోగాలు భర్తీ చేశామని మరికొంత మంది సభ్యులు నోడల్ ఆఫీసర్‌కు వివరించారు. నివేదికను జిల్లా ఉన్నతాధికారులకు అందజేస్తానని ఆయన తెలిపారు.

ఆర్వోబీపై మరమ్మతులు చేపట్టాలి



కాజీపేట అర్బన్: కడిపికొండ ఫ్లైఓవర్ బ్రిడ్జిపై మరమ్మతులు చేపట్టాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. సాక్షి దినపత్రికలో సోమవారం ప్రచురితమైన అధ్వానంగా కడిపికొండ ఆర్వోబీ అనే కథనానికి స్పందించిన సీపీఎం కాజీపేట మండల కార్యదర్శి ఓరుగంటి సాంబయ్య ఆధ్వర్యంలో పలువురు నాయకులు కడిపికొండ ఆర్వోబీని సోమవారం పరిశీలించి మాట్లాడారు. బ్రిడ్జిపై ఏర్పడిన గుంతలకు మరమ్మతులు చేపట్టి, నాణ్యతా ప్రమాణాలు పెంచాలని సూచించారు. అదేవిధంగా భారీ వాహనాల రాకపోకలను క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు జంపాల రమేష్, చంటి, రవి పాల్గొన్నారు.

నిరుపేద కుటుంబానికి చేయూత



హసన్‌పర్తి: హసన్‌పర్తికి చెందిన నిరుపేద కుటుంబానికి లయన్స్ క్లబ్ చేయూతనందించింది. బాధిత కుటుంబానికి బియ్యంతో పాటు నిత్యావసర వస్తువులు అందించింది. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షుడు కృపాకర్ మాట్లాడుతూ క్లబ్ ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు చేపడుతున్నట్లు వివరించారు. హసన్‌పర్తికి చెందిన జన్ను అనూష – అనిల్ కుమార్ దంపతులకు చేయూతనందించినట్లు చెప్పారు. కార్యక్రమంలో క్లబ్ కోశాధికారి డాక్టర్ శేఖర్, సభ్యులు పాల్గొన్నారు.

క్రీడల వైపు దృష్టి సారించాలి



ఖిలా వరంగల్: చెడు అలవాట్లకు యువత బానిస కాకుండా క్రీడల వైపు దృష్టి సారించాలని ఏసీపీ నాగయ్య సూచించారు. వరంగల్ శంభునిపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణంలోని క్రీడామైదానంలో స్పైక్ టౌన్ వాలీబాల్ క్లబ్ శంభునిపేట ఆధ్వర్యంలో రెండు రోజులు జరుగుతున్న వాలీబాల్ క్రీడలు సోమవారం ముగిశాయి. ముఖ్యఅతిథిగా ఏసీపీ నాగయ్య హాజరై విజత జట్టు పున్నేలు టీమ్‌కు రూ.10 వేల నగదు, మెమొంటో, ట్రోఫీని అందజేసి క్రీడాకారులను అభినందించారు. లక్ష్మీనారాయణ, ఫిజికల్ డైరెక్టర్లు సుధాకర్, వెంకట్‌రెడ్డి, నారాయణ, అమీర్, రంజిత్ కిషోర్, సందీప్, అఖిల్ పాల్గొన్నారు.

భోజన ప్యాకెట్ల పంపిణీ



కాజీపేట రూరల్: ఆకలితో ఉన్న అభాగ్యులను ఆదరించి వారి కనీస అవసరాలను తీర్చాలని జీసస్ ప్రేయర్ హాల్ వ్యవస్థాపక అధ్యక్షుడు పాస్టర్ మరియదాస్ సూచించారు. కాజీపేట జంక్షన్ పరిధిలో 50 మంది అనాథలకు సోమవారం ఆహార ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏసుక్రీస్తు బైబిల్‌లో చెప్పినట్లుగా తనకు ఉన్నదాంట్లో కొంత, దాతల సహాయంతో మరికొంత సొమ్ముతో గత 18 ఏళ్లుగా సేవా కార్యక్రమాలు చేస్తున్నట్లు ఆయన వివరించారు. జిల్లా కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి పసునూరి మనోహర్ మాట్లాడుతూ తనవంతు సహాయం చేస్తానని అన్నారు. సెక్రటరీ తాళ్లపల్లి ఆనందం, నవీన్‌రెడ్డి, సంజీవ, రాజేష్, యాదగిరి, మేకల ఉపేందర్ పాల్గొన్నారు.

నగరంలో ఘనంగా భోగి వేడుకలు



శివనగర్‌లోని వాసవిలేన్‌లో భోగి మంటలు వేస్తున్న మహిళలు



బాలసముద్రంలో..



కాజీపేటలో గంగిరెద్దుల ప్రదర్శన



హసన్‌పర్తి: ముచ్చర్లలో భోగి వేడుకల్లో స్థానికులు



ముగ్గు వేస్తున్న యువతి



చింతల్ భక్త హనుమాన్ కమిటీ ఆధ్వర్యంలో..



కాకతీయ యూనివర్సిటీ సమీపంలో..

మకర సంక్రాంతి వేడుకల్లో భాగంగా సోమవారం భోగి పర్వదినాన్ని నగరవాసులు ఘనంగా జరుపుకున్నారు. తెల్లవారుజామునే ఇంటిముందు ముగ్గులు వేసి, రంగులతో అలంకరించి, మధ్యలో ఆవుపెడతో చేసిన గొబ్బెమ్మలు, గరిక, పిండికూర, నవధాన్యాలు, పూలు, కూరగాయలు పెట్టి సూర్యదేవుడికి నమస్కారాలు చేశారు. మహిళలు పోటీపడి ముగ్గులు వేయడంతో వీధులు ఇంద్రధనస్సుల్లా శోభాయమానంగా కనిపించాయి. వాడల్లో గంగిరెద్దుల వాళ్లు సందడి చేశారు. సాయంత్రం ముత్తైదువులను ఇళ్లకు పిలిచి చిన్నారులకు భోగిపండ్లు పోయించారు. వైష్ణవ దేవాలయాల్లో గోదాకల్యాణాలు నిర్వహించారు. - సాక్షి నెట్‌వర్క్

జోరుగా పతంగుల విక్రయాలు

కాజీపేట: సంక్రాంతి పండుగ వచ్చిందంటే చాలు.. ఆకాశంలో రంగురంగుల గాలిపటాలు కనువిందు చేస్తుంటాయి. పండుగకు పదిహేను రోజుల ముందు నుంచే చిన్నా, పెద్ద అనే తేడా లేకుండా ప్రతిఒక్కరూ గాలిపటాలను ఎగురవేస్తున్నారు. సంక్రాంతి పర్వదినంలో గాలిపటాలకు ఎనలేని ప్రాధాన్యం ఉంటుంది. కాజీపేట పట్టణంతోపాటు శివారు గ్రామాల్లో యువకులు పోటీపడి గాలిపటాలను ఎగురవేస్తున్నారు. మైదానాలు, ఇళ్లపైన చిన్నారులు, యువకులు సందడిగా కనిపిస్తున్నారు. పిల్లల ఆసక్తికి అనుగుణంగా వ్యాపారులు గాలి పటాలను తయారు చేసి విక్రయిస్తూ నాలుగు కాసులు వెనకేసుకుంటున్నారు. ఈ ఏడాది సినీ హీరోలు, క్రికెట్ ఆటగాళ్లు, రాజకీయ నాయకుల పటాలకు మంచి డిమాండ్ ఉందని వ్యాపారులు చెబుతున్నారు. ప్రజాప్రతినిధులు, పీస్ కమిటీ సభ్యులు పిల్లలు, యువకుల అభిరుచికి అనుగుణంగా పతంగులను తయారు చేయించి ఉచితంగా అందజేస్తున్నారు. గతేడాదితో పోలిస్తే ఈమారు కాస్త ధరలు పెరిగినా గిరాకీ మాత్రం తగ్గలేదని, ఒక భోగి పండుగ రోజు రూ.24 వేల విలువైన పతంగులను విక్రయించినట్లు శ్రీనివాస్ అనే వ్యాపారి 'సాక్షి'తో తెలిపారు. సంక్రాంతి అనంతరం మరో 15రోజులపాటు పతంగుల విక్రయాలు సాగుతాయని చెప్పారు.



కాజీపేటలో పతంగులతో స్థానికులు

పోలీసులకు సమాచారం ఇవ్వండి



హసన్‌పర్తి: పండుగకు ఊళ్లకు వెళ్లితే పోలీస్‌స్టేషన్‌లో సమాచారం ఇవ్వాలని కాకతీయ యూనివర్సిటీ ఇన్‌స్పెక్టర్ రవికుమార్ సూచించారు. దొంగతనాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచిస్తూ కరపత్రాల ద్వారా ప్రచారం నిర్వహించారు. సమాచారం ఇస్తే ఆ ప్రాంతంలో పెట్రోలింగ్ పెంచుతామన్నారు. ఇంటిలో విలువైన వస్తువులు ఉంటే వాటిని బ్యాంక్ లాకర్లల్లో పెట్టుకుని వెళ్లాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్సైలు రవీందర్, శ్రీకాంత్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. ప్రజలకు ఇన్‌స్పెక్టర్ పలు సూచనలు చేశారు.

- తిరిగి ఇంటికి వచ్చే వరకు పేపర్, పాల ప్యాకెట్లు వేయొద్దని వేసే వాళ్లకు చెప్పాలి.
- ఇంటికి అమర్చిన సీసీ కెమెరాలు పనిచేస్తున్నాయా, లేదా అని చెక్ చేసుకోవాలి. మొబైల్‌కు లింక్ చేసుకుని ఎప్పటికప్పుడు చెక్ చేసుకోవాలి.
- తాళం కనిపించకుండా కర్టెన్ ఏర్పాటు చేసుకోవాలి.
- మెయిన్ గేట్‌కు తాళం కనిపించకుండా జాగ్రత్తలు తీసుకోవాలి.
- పక్క ఇంటి వారికి సమాచారం ఇవ్వాలి.
- ఇంటిముందు లైట్ వెలిగేలా చూసుకోవాలి.

కార్పొరేట్ వ్యవసాయ విధానాన్ని వ్యతిరేకించాలి



నిరసన తెలుపుతున్న ఏఐకేఎంఎస్ ప్రతినిధులు

- ఏఐకేఎంఎస్ కార్యవర్గ సభ్యుడు బాలరాజు

ఖిలా వరంగల్: కేంద్రం ప్రవేశ పెట్టిన నూతన కార్పొరేట్ వ్యవసాయ విధానాన్ని ప్రతిఒక్కరూ వ్యతిరేకించాలని ఏఐకేఎంఎస్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రాచర్ల బాలరాజు సూచించారు. సంయుక్త కిసాన్‌మోర్చా (ఎస్‌కేఎం) పిలుపులో భాగంగా ఖిలా వరంగల్ పడమరకోట అంబేడ్కర్ విగ్రహం వద్ద ఏఐకేఎంఎస్ ఆధ్వర్యంలో నూతన కార్పొరేట్ వ్యవసాయ విధానం ఒప్పంద పత్రాలను సోమవారం దహనం చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కనీస మద్దతు ధర హక్కు చట్టం చేయాలని జాతీయ రైతు సంఘం నాయకుడు జగ్జీత్‌సింగ్ దల్లైవాల్ 50 రోజులుగా నిరవధిక నిరాహార దీక్ష చేస్తున్నారని గుర్తుచేశారు. అయినా కేంద్రం పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఏఐయూకేఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి చిర్ర సూరి, ఐలయ్య, మైదం పాణి, ఇనుముల కృష్ణ, ఎండీ.అక్బర్, సుద్దాల వీరయ్య తదితరులు పాల్గొన్నారు.

డీఎంహెచ్‌ఓ అప్పయ్యకు సన్మానం



హన్మకొండ చౌరస్తా: డీఎంహెచ్‌ఓ డాక్టర్ అప్పయ్యను తెలంగాణ సెపక్‌తక్రా అసోసియేషన్ బాధ్యులు సన్మానించారు. హనుమకొండలోని జేఎన్ స్టేడియంలో ఈనెల 10 నుంచి జరుగుతున్న సీనియర్ నేషనల్ సెపక్‌తక్రా పోటీలకు హాజరైన క్రీడాకారులకు జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ సిబ్బంది వైద్య సేవలు అందించినందుకు ఇండోర్ స్టేడియంలో డాక్టర్ అప్పయ్యను సోమవారం అభినందించారు. కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరెడ్డి, జిల్లా సెక్రటరీ జితేంద్రనాథ్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

కంటికి రెప్పలా కాపాడుకుంటాం..

హన్మకొండ / హసన్‌పర్తి: కార్యకర్తలు, వారి కుటుంబాలను కంటికి రెప్పలా కాపాడుకుంటామని మాజీ చీఫ్ విప్, బీఆర్ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్ అన్నారు. హసన్‌పర్తి మండలం బైరాన్‌పల్లికి చెందిన మాజీ ఎంపీటీసీ ములకలపల్లి కుమారస్వామి ఇటీవల మరణించారు. పార్టీ సభ్యత్వ బీమా చెక్కు రూ.రెండు లక్షల క్లైయిమ్ మంజూరు కాగా, హనుమకొండ వడ్డెపల్లిలోని స్వగృహంలో జరిగిన కార్యక్రమంలో ములకపల్లి కుమారస్వామి సతీమణి సవిత, కుటుంబ సభ్యులకు వినయ్‌భాస్కర్ సోమవారం చెక్కు అందజేశారు. కార్యక్రమంలో బైరాన్‌పల్లి గ్రామ మాజీ సర్పంచ్ కుందూరు సాంబరెడ్డి, పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు బైరి మధుకర్ రెడ్డి, పీఏసీఎస్ మల్లారెడ్డి పల్లె సొసైటీ వైస్ చైర్మన్ ములకలపల్లి జయశంకర్, గ్రామశాఖ మాజీ అధ్యక్షుడు గోగుల శ్రీనివాస్, బీఆర్ఎస్ నాయకులు బండి రజనీకుమార్, జట్టి రాజేందర్, పిడుగు రాజేందర్, యాదగిరి, శివకుమార్, యాకుబ్ పాషా పాల్గొన్నారు.



బీమా చెక్కు అందజేస్తున్న వినయ్‌భాస్కర్

రేపు టీటీడీ ఆధ్వర్యంలో గోపూజలు



హన్మకొండ కల్చరల్: కనుమ పండుగను పురస్కరించుకుని తిరుమల తిరుపతి దేవస్థానం, హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా బుధవారం గోపూజలు నిర్వహించనున్నట్లు టీటీడీ కార్యక్రమ నిర్వాహకుడు రామిరెడ్డి కృష్ణమూర్తి తెలిపారు. హనుమకొండ లష్కర్‌బజార్‌లోని టీటీడీ కల్యాణ మండపంలోని శివాలయంలో ప్రచార బ్యానర్‌ను సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హనుమకొండ జిల్లా కమలాపూర్ మండలం గుండెడు గ్రామంలోని ఆంజనేయస్వామి దేవాలయం, వరంగల్ జిల్లా పర్వతగిరి ఏనుగల్లు గ్రామం డాక్టర్ వెంకటేశ్వరరావు గోశాలలో గోపూజలు జరుగుతాయని వివరించారు. కార్యక్రమంలో ప్రముఖ హోమియో వైద్యుడు కనపర్తి వెంకటేశ్వరరావు, కల్యాణ మండపం మేనేజర్ రఘువీర్, శివాలయం పూజారి అమర్‌నాథ్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా గోదాదేవి రంగనాథుల కల్యాణం



హన్మకొండ చౌరస్తా: కల్యాణ వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే నాయిని దంపతులు



ఉర్సుగుట్టపై రంగనాథ స్వామిని దర్శించుకుంటున్న కార్పొరేటర్ రవి, భక్తులు



కాజీపేట: శ్వేతార్క ఆలయంలో గోదాదేవి వేషధారణలో..



హన్మకొండ కల్చరల్: చిన్నకోవెల సీతారామచంద్ర స్వామి దేవాలయంలో..

హన్మకొండ చౌరస్తా: హనుమకొండ 5వ డివిజన్ పరిధిలోని రెడ్డికాలనీలోని అభయాంజనేయ స్వామి దేవాలయంలో 23వ ధనుర్మాసోత్సవం సందర్భంగా సోమవారం గోదాదేవి రంగనాథుల కల్యాణ వేడుకలు జరిగాయి. వేడుకల్లో ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, నీలిమారెడ్డి దంపతులు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. వేడుకల్లో స్థానిక కార్పొరేటర్ పోతుల శ్రీమన్నారాయణ స్థానికులు పాల్గొన్నారు.

వరంగల్ ఉర్సుగుట్టపై..

ఖిలా వరంగల్: వరంగల్ ఉర్సుగుట్టపై గోదా రంగనాథస్వామి కల్యాణం సోమవారం వైభవంగా జరిగింది. ఆలయ ప్రధాన పూజారి వరయోగుల భాస్కచారి, స్థానిక కార్పొరేటర్ మరుపల్లి రవి ఆధ్వర్యంలో కల్యాణ వేడుకలు నేత్రపర్వంగా జరిగాయి. కార్పొరేటర్ పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించారు. కార్యక్రమంలో పూజారులు లక్ష్మీప్రసాద్, ప్రవీణ్, కృష్ణ, భక్తులు పాల్గొన్నారు.

రాగన్న దర్వాజలోని చిన్నకోవెలలో..

హన్మకొండ కల్చరల్: రాగన్న దర్వాజలోని చిన్నకోవెల సీతారామచంద్ర స్వామి దేవాలయంలో గోదారంగనాథుల కల్యాణం జరిగింది. ఆలయ అర్చకుడు చెరకుమల్లి నర్సింహాచార్యులు పాంచారాత్ర ఆగమన సంప్రదాయం ప్రకారం కల్యాణోత్సవం జరిపించారు. కార్యక్రమంలో చీకటిరాజు, వెంకటేశ్వర్లు, సతీష్, ఆంజనేయులు, భక్తులు పాల్గొన్నారు.

చైతన్యపురి కాలనీలో..

కాజీపేట: చైతన్యపురికాలనీ వెంకటేశ్వరస్వామి దేవాలయ ఆవరణలో గోదాదేవి, పద్మావతి సమేత శ్రీనివాసుల కల్యాణ వేడుకలను సోమవారం రాత్రి నిర్వహించారు. ఆలయ ప్రధాన పూజారి రఘురామాచార్యులు, బ్రహ్మశ్రీ శ్రీనివాసాచార్యుల ఆధ్వర్యంలో పండితులు వివాహ మహోత్సవాన్ని కనుల పండువగా నిర్వహించారు. ఆలయ అభివృద్ధి కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు పంజాల అశోక్‌కుమార్ గౌడ్, మేజర్ వడ్డెపల్లి నరేందర్‌లతో పాటు కాలనీ పెద్దలు హాజరయ్యారు. కాజీపేట స్వయంభూ శ్వేతార్క మూలగణపతి దివ్యక్షేత్రంలో చిన్నారులు సుప్రజ, చందన, స్వస్తిక్ మనాలీ.. గోదాదేవి, పద్మావతిల వేషధారణలతో అలరించారు.



మడికొండ వేణుగోపాల స్వామి ఆలయంలో..

మడికొండలో..

మడికొండ: 64వ డివిజన్ మడికొండ గ్రామంలోని వేణుగోపాలస్వామి దేవాలయంలో అర్చకులు అనుముల నవీన్, కేసరి మంత్రోచ్ఛరణ మధ్య సోమవారం రాత్రి గోదాదేవి కల్యాణం నిర్వహించారు. ఉదయం నుంచి ప్రతేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు కల్లెపు నర్సయ్య, దువ్వ శ్రీకాంత్, కడార్ల నరేందర్, ఉపేంద్రచారి, టి.యాదగిరి, బజ్జూరి శ్రీనివాస్, బైరి రాజు, భక్తులు పాల్గొన్నారు.

సైకిల్‌ను ఢీకొట్టిన ద్విచక్ర వాహనం

హసన్‌పర్తి : సైకిల్‌పై రోడ్డు దాటుతున్న ఓ వ్యక్తిని ద్విచక్ర వాహనం ఢీకొట్టగా అతడికి తీవ్ర గాయాలయ్యాయి. హసన్‌పర్తికి చెందిన వృద్ధుడు చెన్నూరి రాజమౌళి కిట్స్ కళాశాలలో సెక్యూరిటీ గార్డ్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. ఆదివారం కూరగాయల కోసం మార్కెట్‌కు వెళ్లి తిరుగు ప్రయాణంలో సైకిల్‌పై రోడ్డు దాటుతున్నాడు. ఈ క్రమంలో వెనుక వైపు నుంచి ఓ బైక్ అతివేగంగా వచ్చి రాజమౌళిని ఢీకొంది. ప్రమాదంలో రాజమౌళికి తీవ్ర గాయాలు కాగా, చికిత్స నిమిత్తం నగరంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించారు. ప్రస్తుతం అతడి పరిస్థితి విషమంగా ఉందని కుటుంబ సభ్యులు వాపోయారు. బాధితుడి కుమారుడి రవి ఫిర్యాదు మేరకు సోమవారం కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ చేరాలు తెలిపారు.